# ఎందుకూ కొరగాడు!

"చికు– చిక్కూ – చిక్ – కూ! ఆ –చికు – చిక్కూ – చిక్ – కూ!"

పెద్దపులి ఆట జోరుగా సాగిపోతున్నది. నలుగురు బడితెలంటి కుర్రాళ్ళు మొలతాళ్ళకు కాగితపు తోకలు తగిలించుకుని, రంగుకాగితపు కళ్ళజోళ్ళు పెట్టుకుని ఉత్సాహంతో అడుగువేస్తున్నారు.

ఆరేళ్ళ బక్కపలచని పిల్లవాడు ఎడంగా నుంచుని, కనుబొమలు ముడేసి ఆట చూస్తున్నాడు. ఆతని ఆత్మో, అంతరాత్మో, మనకు తెలీని ఇంకేదో వాళ్ళకు వంత పలుకుతున్నది.

"చికు – చిక్కూ – చిక్ – కూ ! ఆ – చికు – చికూ – చిక్– కూ !"

వాళ్ళ మాదిరిగా ఆడటం తనకెందుకు చేతకాదూ! తనలో లేని శక్తి వాళ్ళలో ఏముందీ? కాగితపు తోక పెట్టుకోటానికి తన కెందుకూ బిడియం?

వాళ్ళమ్మ రోజుకు పదిసార్లయినా అంటుంది—'వీడెందుకూ కొరగాడు!'

'అదేనేమో కారణం!'

"ఏంరా? నాన్నా, ఈ మూటేమిటి? కందిపప్పా? ఇది పెసలా? ఇవి మిరపకాయలా? మెంతులేవిరా?"

"వాటి పేరు మర్చిపోయినానమ్మా! పోయి తీసుకురానా?"

"ఛా! పిచ్చికుంకా. చెప్పిన వాటిర్లో సహం మర్చిపోతావేరా? ఎప్పుడూ బుద్ధి ఎక్కడో ఉంటుందీ! మీ నాన్న అన్నట్టు—"

"ఏమిటే అదీ?"

"ఏం లేదు లెండి! మెంతులు మరిచిపోయినాడు.... అయ్యోయ్యో! ఇదేమిట్రా!"

"ఏమిటే అదీ?"

"వీడితో ఎట్టా చావనండీ! పచ్చపెసలు తెచ్చాడు. అర్ధరూపాయి పచ్చపెసలు నా బొందలో ఎక్కడ బోర్లించుకునేది? సున్నిపిండి విసిరి వారం కాలేదింకా! ఆరునెల్లదాకా ఉంది!....పో! ఇవి ఆ కోమటి మొహానపోసి మంచివి తీసుకురా!"

"ఆ వెధవ ఎందుకూ కొరగాడు ! కోమటి ఏమనుకుంటాడో!"

తన్ను ఎందుకూ కొరగాడంటే కష్టంగానే ఉంది. కాని వాళ్ళు అబద్ధమాడుతారా?

గణపతి లోపల్నించి పొంగివస్తున్న దిగులును రెండు గుటకలుగా మింగేశాడు.

"ఏంరా నాన్నా"

"ఊఁ!"

"అప్పుడే పడుకున్నావ్రటా?"

"నిద్దరొస్తున్నదే!"

గణపతికి నిద్దర రావటం లేదు. ఆరు బయట మంచంమీద వెల్లికలా పడుకుని చూస్తున్న చంద్రుణ్ని విడిచి పోబుద్ధి పుట్టలేదు. చంద్రుడిలోనూ కిటికి చువ్వల్లోనూ వున్న చిత్రమేమిటంటే వాటి వంక ఒక రకంగాచూస్తే చేతికి అందే టంత దగ్గిరిగా వచ్చినట్టు కనబడి దృష్టిపక్కకు తిప్పితే తప్ప ఎడంగా పోవు. ఇప్పుడు చంద్రుడు చేతి కందేటంత దగ్గిరిగా వున్నాడు. ఎందుకూ పోనివ్వటం?

"ఛా! వెధవా! చదువూ లేదు సంధ్యా లేదు. నీకెట్లా చదువొస్తుందిరా? పిచ్చి కుంకా?"

ఒక నిట్టూర్పు విడిచి లేచాడు గణపతి. దూరానికి పోయిన చంద్రుడి వంక ఒకసారి చూసి లోపలికివెళ్ళి చాపవేసుకుని, కిరసనాయిలుబుడ్డి తెచ్చుకుని, తెలుగు వాచకం ముందు వేసుకొని పేజీలు తిప్పటం మొదలు పెట్టాడు.

"జడివాన కురియ బోవుచున్నది సుమీ!-"

గణపతి అక్షరాలు చూడటం మానేసి బొమ్మలుచూడటం మొదలు పెట్టాడు. చూస్తుండగానే ఆ బొమ్మ పెద్దదయింది. మనిషి బొమ్మలు మనుషులంతయినై. వాన కురుస్తున్నది. వానలో తడుస్తున్నవాడల్లే గణపతి కొద్దిగా వణికాడు. తాటాకుల గొడుగు వేసుకొని తన వంక చూస్తున్న వాణ్ని చూస్తే గణపతికి కొద్దిగా నవ్వొచ్చింది. గూడలు వేసుకొని పోతున్న వాళ్ళను చూస్తే ఎందుకో కొద్దిగా జాలేసింది. తడి రోడ్డుమీద పాపలు!....అటు యిటూ చాలాదూరందాకా ఇళ్ళులేవు. ఇటుపోతే ఫ్యాక్టరీలు వస్తయి!.... అటుపోతే?....

"చూడండి:- ఈ వెధవ! నిద్దరపోయినాడు. ఒక్క కాగితం తిప్పాడేమో? వీడికేం చదువొస్తుందీ?"

"వాడా వాడెందుకూ కొరగాడు!

గణపతి చప్పుడు చెయ్యకుండా తల్లి మంచం దగ్గిరికివచ్చి నిశ్చలంగా ఆమె జీర్ణ శరీరం వంక చూస్తూ నుంచున్నాడు.

"అమ్మ బతకదు! అమ్మ చచ్చిపోయింది! బతకదు!" ఆవిడ కళ్ళు తెరిచి చూచింది.

"ఏం రా, నాన్నా?"

గణపతి జవాబు చెప్పలేదు.

"పిచ్చి నాన్నా! నే పోతే నీకు దిక్కెవ్వర్రా?"

గణపతి మంచం పక్కన మోకరించి మొహం ఆవిడ పక్కమీద పెట్టి కుళ్ళి కుళ్ళి యేడవటం మొదలు—పెట్టాడు.

తల్లి కొడుకు తల తన చేతి బొమికలతో తడుపుతూ "నా పిచ్చి తండ్రీ! యేడవకు!" అంది.

*　　　*　　　*　　　*

అప్ప పోయిందన్న ఏడుపు, తనకు సవితితల్లి వస్తుందన్న ఏడుపుగా మార్చింది తన పినతల్లి. అతని కాశ్చర్యం వేసింది.

ఏం. సవితి తల్లి వస్తే? తన తల్లిని రెండో సంబంధం చేస్తే, ఆవిడ అప్పుడిం కోరికి సవితితల్లి అయి ఉండేది కాదూ?

తెలీని మనిషిని గురించి ఎందుకిట్లా అనటం?

*　　　*　　　*　　　*

కారణం లేకుండా ఒక మనిషిని చూస్తే ఇంకో మనిషికింత కోపం ఉంటుందా? ఎందుకు తన సవతితల్లి తన్ను చూస్తేనే మొహం మటమట లాడించు తుందీ? తన గొంతు వినపడితేనే ఆవిడకు కోపమా? లేక తన భ్రమా?

"పిన్నీ!" అని పిలిస్తే "అమ్మా!" అని పిలవమంది; "అమ్మా!" అని పిలిస్తే "అంత అయిష్టంగా పిలవకపోతే మానరాదా" అంది! ఏం చెయ్యాలి?

యధాలాపంగా "ఏదో ఒకటి వెయ్యిలే" అంటే సరి. తనకు సయించని చింత కాయ తొక్కు తెచ్చి వేస్తుంది అన్నంలో!

ఈవిడ ఇట్లా చెయ్యబోతుందని వాళ్ళకెట్లా తెలుసో!

వాళ్ళన్నట్టే చెయ్యాలా ఈవిడ? వాళ్ళమాట అబద్దం చెయ్యటానికైనా ఇంకో రకంగా వుండరాదూ?

తన తండ్రి తన్ను చూస్తే కారాలు మిరియాలు నూరతాడు. ఆవిడ తన మీద చాడీలు చెప్పదు కద!—— వాళ్ళంతా అన్నట్టు!

ఏ మనిషి మాత్రం అంత అసహ్యకరమైన పని ఏం చెయ్యాలిసొస్తుంది?

"ఎందుకూ కొరగాని వెధవ్వి! నాకెదురుగా ఎందుకురా! పో లేచిపో! మీ పింతల్లి పోషిస్తుందేమో!" అన్నాడు తండ్రి.

ఒక చెంప నెత్తురు బంక శిరోచనాలు వెళ్ళుతూ బజారుకు నడిఎండలో వెళ్ళలేనన్నందుకా? మొత్తానికి తన పింతల్లి విచిత్రమైన వ్యక్తే!

తన తల్లికోసం ఆవిడ ఏడుస్తుంటే తనకు జాలికి బదులు – సానుభూతికి బదులు– చిరాకు వేస్తుందెందుకూ ?

తను ఏడుస్తున్న వాడేగా! అర్ధరాత్రి తల్లి జ్ఞాపకం వచ్చినప్పుడు—మొహం దిండులో దూర్చి – నిశ్శబ్దంగా!

ఈవిడకి తనంటే ఎంత ప్రాణం. నెత్తురు స్పర్శా? కాకపోతే ఆవిడ తన్నేం బాగా ఎరుగునూ? — గుణగణాదులు తెలియటానికి?

ఆన పింతల్లి ఆవిడకు తనమీద వున్న ఆపేక్ష ఇంతకన్నా కాస్త రహస్యంగా ఉంచితే బాగుండదూ? ఎందుకంటే ఆవిడ గొంతులో మాటల్లో ఉన్నంత ఉద్రేకం లేనట్టు అనుమానం తట్టుతున్నది!....పాపం!

ఏమిటి ఈవిడదంతా నటనకాదు కదా! అనుమానించటం మనసు కెంత నెప్పి కలిగిస్తుందీ!

"మా నాయన! మా నాయన! ఒక్కరవ్వ విస్తరెత్తుకుంటావా? మడితో కందులు వేయించాలి."

"అట్లాగేలే పిన్నీ!"

"అదుగో, మెతుకు! అదుగదుగో — ఉండుండు. ఆదేమిటీ? ఎప్పుడన్న చాతవునా! పెట్టునా పాపం.....

* * * *

"మా నాయన! మా నాయన! విస్తర ఎత్తి పారెయ్యకపోతే మానెగాని. చీమ లీడ్చుకుపోతై, కాస్త మెతుకులెత్తి, విస్తరి మడిచి, అక్కడే ఉంచిపో!"

గణపతి విస్తరి తీసుకుపోతూ ఆవిడ వంక చూసి నవ్వాడు. ఆ నవ్వులోని నిరసన ఆవిడ కర్థం కాలేదు.

అతనికి కష్టం ఆవిడ తన్ను ఇట్లా చూస్తున్నందుకు కాదు - అప్పుడట్లా చూసినందుకు!

ఎవరిని వంచించాలని?

ఆత్మ వంచనా?

ఏం మనుషులు!

ఒక గుడి మండపంమీద ఎక్కి కూర్చుని ఉన్నాడు గణపతి, కాళ్ళు ఊగిస్తూ కడుపులో ఒక చెంప దహించుకు పోతున్నది. అన్నంవేళ అయి రెండు గంట లయింది. కాని అతనికది పట్టలేదు.

అకస్మాత్తుగా అంధుడికి కళ్ళువస్తే అప్పుడేనా భోజనం సంగతి విచారించ వలసింది!

అతని మొహం నూతన వికాసంతో ప్రకాశిస్తున్నది. అతనో కొత్త విషయం కనిపెట్టాడు.

ఈ అందరూ పశువులు! పురుగులు ! అంతా! ఒక్కరుకూడా బీరు పోకుండా!

ఇంత కాలమూ పెద్దవాళ్ళంతా ఏదో తెలిసినట్టు నటించారు. కాని ఎవరికీ ఏమీ తెలీదు.

వీళ్ళ తెలీటం తెలుసుకోవాలని లేకపోవటం! బహుశ ఇందుకు సందేహమేమీ ఉండదు.

"జయ్! మహాత్మాగాంధీకి—"

"కయ్" చెవులు బద్దలయ్యే ధ్వని.

ఎందుకట్లా అరుస్తారు. ఉత్సాహం కోసమా? ఎందుకట్లా ఉద్రేకం తెచ్చి పెట్టుకోటం? ఉద్రేకంతో ఏం పని చెయ్యగలరు?

"జయ్!" "జయ్!" "జయ్!"

మిన్ను విరిగి పడ్డట్టే!

ఇదేమిటి, అల్లరి కాకపోతే?

గణపతి పద్దంత వరకు కనిబొమలు ముడివేశాడు. అతనికి కోపం వచ్చింది. మండపం మీది నుంచి ఒక్క దూకు దూకి పరిగెత్తటం మొదలు పెట్టాడు.

"జయ్"లు వినబడుతున్న వేపు.

అనేకమంది జనం ఎదురుగా వస్తున్నారు రణగొణ ధ్వని చేసుకుంటూ!

ఎందుకల్లా అరుస్తారు?

కాళ్ళు కొంచెము ఎడంగా పెట్టి, తల ఠీవిగా పైకెత్తి, రోడ్డుమీద అడ్డంగా నుంచున్నాడు....గజమున్నర ఎత్తుధీరుడు!

ఊరేగింపు అంత దూరంలోకి వచ్చింది.

గణపతి చెయ్యి పైకెత్తి—

"ఏయ్! ఎందుకట్లా అరుస్తారూ? మీరేం చేస్తున్నామనుకుంటున్నారూ? పొండి! మీ యిళ్ళకు పొండి!"

"ఎవఁడ్రా వాడూ?" అన్నాడు ముందు నడుస్తున్న వారిలో ఒకడు.

"ఏమిటంటాడూ?"

"వాడి మొహం. పక్కకు లాగేసి వెనకాలే రమ్మనండి!"

"గొర్రెలు! గొర్రెలమంద! పొండి! ఇంటికి పొండి!? ఎందుకట్లా అరుస్తారు."

"ఏ-మి-టీ?" అన్నాడొక నల్లగా పెం

(ఇంతవరకే లభ్యం)

ముద్రణ : యువ, నవంబరు—డిసెంబరు 1935.